

మహిళా వర్సిటీ వీసీగా ఉమ బాధ్యతలు స్వీకరణ



ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ రెగ్యులర్ వీసీగా ఆచార్య వి.ఉమ బుధవారం వీసీ ఛాంబర్‌లో రిజిస్ట్రార్ ఎన్.రజని, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ బి.గీతావాణి సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఉమ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి, ఈ బాధ్యతను అప్పగించినందుకు సిఎం చంద్రబాబునాయుడుకి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మహిళా వర్సిటీలో గత 40 సంవత్సరాలుగా పనిచేయటం వలన పూర్తి అవగాహన కలిగి ఇంకా అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లగలనని, పూర్తి నమ్మకం, ధైర్యం, సంకల్పం కలిగి ఉన్నానన్నారు. ప్రస్తుతం యూనివర్సిటీ నాక్ ఏ గ్రేడ్ సాధించిందని, కానీ ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ లో 100-150 బ్యాండ్‌లో ఉన్నామని, ప్రస్తుతం ర్యాంకింగ్ ను ఇంకా మెరుగుపరిచే విధంగా ఫోకస్ చేస్తామని తెలిపారు.



తిరుపతి అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సిపిఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు

మిలియనీర్ల మేలుకోరే బడ్జెట్

కేంద్ర బడ్జెట్‌పై వామపక్షాల నిరసన హోరు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ, యంత్రాంగం

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ శక్తుల ఆస్తులు పెంచేదిగా ఉందని, సామాన్యులకు ఏమాత్రం సానుకూలంగా లేదని వామపక్షాలు ధ్వజమెత్తాయి. ఒక్కమాటలో చెప్పాలంటే ఇది మిలియనీర్ల మేలుకోరే బడ్జెట్ అని అన్నారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే దేశ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలడం ఖాయం అన్నారు. కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ తిరుపతి జిల్లావ్యాప్తంగా నిరసనలు జరిగాయి. తిరుపతి అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం ఉదయం సిపిఐ, సిపిఎం, సిపిఐ (ఎంఎల్) ఆధ్వర్యంలో నిరసన జరిగింది. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కార్పొరేట్లకు ఊడిగం చేస్తోందన్నారు. దేశంలో నిరుద్యోగ సమస్య తీవ్రమవుతోందన్నారు. రైతులు గిట్టుబాటు ధర కోసం ఏళ్ల తరబడి పోరాటాలు చేస్తున్నా మోడీ ప్రభుత్వానికి చీమకుట్టినట్లు లేదన్నారు. వందశాతం ఎఫ్‌డిఐలకు అనుమతి చెప్పడం వల్ల ప్రభుత్వరంగ సంస్థలన్నీ ప్రైవేటుపరం అయ్యే అవకాశం ఉందన్నారు. నరేంద్రమోడీ అంబానీ, అదానీ ఆస్తులు పెంచడానికి కృషి చేస్తున్నారన్నారు. 2014లో సార్వత్రిక ఎన్నికల సందర్భంగా నరేంద్ర మోడీ ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు. ధరలు తగ్గించలేదని, ఉద్యోగాలు రాలేదని, రైతుల సమస్యలు పరిష్కరించలేదని, నల్లధనం వెనక్కి తీసుకురాలేదన్నారు. అమెరికాలో ఉన్న భారతీయులకు సంకెళ్లు వేసి డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం గుర్తింపు వెనక్కి పంపుతుంటే, ఈ అంశంపై నరేంద్రమోడీ కనీసం ఒక్క మాట మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. అదానీ కోసం మాత్రం ట్రంప్ వద్ద మాట్లాడుతున్నారన్నారు. అదానీకి ఊడిగం చేయడానికి నరేంద్రమోడీ అమెరికా పర్యటనకు వెళ్లారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రామానాయుడు, జిల్లా కార్యదర్శి పి.మురళి, జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, రాధాకృష్ణ, విశ్వనాథ్, రవి, సిపిఎం జిల్లా కార్యదర్శి నాగరాజు, జయచంద్ర, లక్ష్మి, సుబ్రమణ్యం, సాయిలక్ష్మి, సిపిఐ (ఎంఎల్) నాయకులు హరికృష్ణ, వెంకటరత్నం పాల్గొన్నారు.

- పుత్తూరులో: అంబేద్కర్ సర్కిల్ వద్ద సిపిఎం, సిపిఐ నాయకులు ఆర్.వెంకటేష్, డి.మహేష్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఇది పేదల బడ్జెట్ కాదని, కార్పొరేట్ల బడ్జెట్ అని నినదించారు. అనంతరం బడ్జెట్ కరపత్రాలను ప్రజలకు పంచారు. వెనుకబడిన రాయలసీమకు, ఉత్తరాంధ్ర, ప్రకాశం జిల్లా అభివృద్ధికి నిధులు కేటాయించలేదన్నారు. నాయకులు బాబుకృష్ణారెడ్డి, సర్వాన్, టి.చంద్రశేఖర్, సుబ్రమణ్యం, విజయ్, హరీష్, రమేష్, మోసెస్ పాల్గొన్నారు.

- శ్రీకాళహస్తిలో: పెళ్లూరు అంబేద్కర్ కూడలి వద్ద నిరసన తెలిపారు. ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగం, అధిక ధరల నియంత్రణకు బడ్జెట్ దోహదపడేలా లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య అన్నారు. ఇప్పటికైనా కేంద్రం బడ్జెట్ కేటాయింపులపై పునరాలోచించాలని సూచించారు. సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి, సిపిఐ ప్రాంతీయ కార్యదర్శి జనమాల గురవయ్య, నాయకులు పెనగడం గురవయ్య, రాధయ్య, రొడ్డా గోపి, శివకుమార్, చారులత, యానాది సంఘం నాయకులు వందమాయం కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

- గూడూరు టౌన్‌లో: మార్కెట్‌సెంటర్, రైల్వేస్టేషన్‌రోడ్డు, రాజవీధుల్లో కరపత్రాలను పంపిణీ చేశారు. సిపిఎం ప్రాంతీయ ఆర్గనైజర్ జోగి శివకుమార్, సురేష్, ఆడపాల ప్రసాద్, చంద్రయ్య పాల్గొన్నారు. గురువారం పాత బస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

కష్టపడిన వారికే పదవులు : నారా లోకేష్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

టిడిపి శ్రేణులు అలకలు వీడాలని, అప్పుడే పార్టీకి బలమని మంత్రి నారా లోకేష్ తెలిపారు. బుధవారం టిడిపి కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశమయ్యారు. ముందుగా ఎన్టీ రామారావు విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ హాజరయ్యారు. మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ తిరుపతిలో పార్టీ కార్యకర్తలు, నాయకులు అలకలు ఉండడం వల్ల పార్టీ సభ్యత నమోదు తిరుపతి జిల్లా చాలా తక్కువ నమోదు అయ్యిందన్నారు. తిరుపతి అసెంబ్లీ టిడిపికి కంచుకోట లాంటిదని, అలాంటి నియోజకవర్గంలో టిడిపి కార్యకర్తలు నాయకులు పార్టీ సభ్యత నమోదు కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని ఉంటే ఇంత తక్కువ వచ్చి ఉండేది కాదన్నారు. ప్రస్తుతం తిరుపతి నియోజకవర్గంలో పార్టీ సభ్యత్వం 47 వేలు ఉందన్నారు. 2014లో టిడిపి ప్రభుత్వ హయంలో తిరుపతి అసెంబ్లీలో లక్ష మంది సభ్యత్వం ఉండేది అన్నారు. కష్టపడిన వారికే నామినేటెడ్ పదవులు లభిస్తాయన్నారు.

అనంతరం డిప్యూటీ మేయర్‌గా ఆర్‌సి మునికృష్ణను గెలిపించిన కార్పొరేటర్లతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఇందులో డిప్యూటీ మేయర్ ముద్ర నార్యాణ, కార్పొరేటర్ నరసింహాచారితో పాటు ఇతర కార్పొరేటర్లు తమను పార్టీలో చేర్చుకోవాలని కోరారు. రానున్న మేయర్ ఎన్నికల్లోనూ టిడిపి అధిష్టానం చెప్పినట్లే చేస్తామని చెప్పినట్లు సమాచారం. త్వరలోనే జిల్లా మంత్రితో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని నారా లోకేష్ చెప్పారు.

ఆ కార్పొరేటర్లు వైసిపి కార్యక్రమంలోనే..

అయితే ఈ సమావేశానికి ఆర్‌సి మునికృష్ణ గెలుపుకు బలవంతంగా సహకారం అందించిన కార్పొరేటర్లు రాకపోవడం గమనార్హం. వీరంతా తిరుపతి ఎస్ఆర్ కల్యాణ మండపంలో జరుగుతున్న వైసిపి నగర అధ్యక్షుని ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు.

అనంతరం 59వ ప్రజాదర్బార్ నిర్వహించి, ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. సెకండ్ ఎఎన్ఎంలను క్రమబద్ధీకరించాలని, రెగ్యులర్ ఎఎన్ఎం పోస్టులను, 2007 నుంచి పనిచేస్తున్న సెకండ్ ఎఎన్ఎంలతో భర్తీ చేయాలని కోరారు.



టిడిపి డిప్యూటీ మేయర్ అభ్యర్థి ఆర్ సి మునికృష్ణారెడ్డికి ఓటు వేసిన వైసిపి కార్పొరేటర్లు అమర్నాథ్ రెడ్డి,అనీష్ రాయల్ వైసీపీ నగర అధ్యక్షుడు ప్రమాణస్వీకారంలో పాల్గొన్న దృశ్యం

పరిశోధనలపై దృష్టి పెట్టండి

విద్యార్థినులతో మంత్రి నారా లోకేష్

ప్రజాశక్తి - క్యాంపస్

'వర్సిటీలో చదువుతున్న విద్యార్థినిలు పరిశోధన, నూతన ఆవిష్కరణలపై దష్టిపెట్టి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయానికి మంచి పేరు తీసుకురావాలి' అని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు. శ్రీ పద్మావతి యూనివర్సిటీ అధునాతన ఇండోర్ స్టేడియంను ప్రారంభించిన అనంతరం ట్రిపుల్ ఈ మూడో సంవత్సరం విద్యార్థినుల తరగతి గదిని సందర్శించిన లోకేష్ వారి సాధక బాధకాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చంద్రగిరికి చెందిన మేఘన మాట్లాడుతూ 'మీ తాతగారు ఎన్టీఆర్ హయాంలో తిరుపతిలో మహిళా వర్సిటీ ఏర్పాటుచేశారని, రాష్ట్ర విద్యా మంత్రిగా మా సమస్యలపై మీరు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నందుకు ఆనందంగా ఉందని, గతంలో రీయింబర్స్ మెంట్ సొమ్ము ఎప్పుడు వస్తుందో, అసలు వస్తుందో, రాదోనన్న ఆందోళనకు గురయ్యేవాళ్లం, మీ ప్రభుత్వం వచ్చిక మొదటి సెమిస్టర్‌కు సంబంధించిన సొమ్ము బకాయి పెట్టకుండా విడుదల చేయడం ఆనందంగా ఉంది, గత ప్రభుత్వ హయాంలోని బకాయిలను కూడా విడుదల చేయాలి' అని కోరారు. మంత్రి లోకేష్ స్పందిస్తూ ఇకపై ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్మును సెమిస్టర్ వారీగా విడుదల చేస్తామన్నారు. గత ప్రభుత్వం నాలుగు వేల కోట్ల రూపాయల రీయింబర్స్‌మెంట్ బకాయి పెట్టిందని, ఆర్థిక పరిస్థితి కుదుటపడ్డాక విడుదల చేస్తామన్నారు. తిరుపతికి చెందిన విజయలక్ష్మి మాట్లాడుతూ 'ఇంజినీరింగ్ పూర్తయ్యాక వివిధ అనుబంధ కోర్సులు నేర్చుకోడానికి పెద్దఎత్తున ఖర్చు చేయాల్సి వస్తోంది. యూనివర్సిటీలోనే ఉద్యోగాలకు అవసరమైన కోర్సుల్లో శిక్షణ ఇవ్వాలి' అని కోరారు. మంత్రి స్పందిస్తూ టెక్నాలజీలో ర్యాపిడ్‌గా మార్పులు వస్తున్నాయని, అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకునేలా



సంస్కరణలు ముందుకు తీసుకెళతామంటున్న లోకేష్

విద్యార్థినులకు శిక్షణ ఇస్తామన్నారు. ప్రభుత్వంతో పాటు, ప్రైవేట్ ఇంజినీరింగ్ విద్యను సమాంతరంగా అభివృద్ధి చేస్తామన్నారు. కడపకు చెందిన సరీమ్, శిరీష తదితరులు మాట్లాడారు. విద్యార్థినుల సమస్యలను నోట్ చేసుకున్న మంత్రి లోకేష్ రాబోయే మూడు నెలల్లో అన్ని యూనివర్సిటీల్లో నిర్మాణాత్మకమైన మార్పులు తెస్తామన్నారు. విద్యావ్యవస్థలో సంస్కరణల కోసం తాను జగన్మోహన్‌రెడ్డిపై చేసిన పోరాటం కంటే మూడు రెట్లు అధికంగా చంద్రబాబుతో పోరాడుతున్నానని చెప్పారు. సంస్కరణల అమలుకు విద్యార్థినులు అందించిన ఫీడ్‌బ్యాక్ తమకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. నారా లోకేష్‌ను సంస్కృత వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జిఎస్ఆర్ కృష్ణమూర్తి మర్యాదపూర్వకంగా కలిసారు.

కామన్ పీజీ సెట్ రద్దు చేయాలని వినతి

ఎన్నికల హామీల్లో భాగంగా చెప్పిన కామన్ పీజీ సెట్‌ను రద్దు చేయాలని తిరుపతి పర్యటనకు విచ్చేసిన మంత్రి నారా లోకేష్‌కు విద్యార్థిసంఘాలు వినతిపత్రం అందించాయి. నాయకులు బండి చలపతి, అక్బర్, చిన్న, మల్లికార్జున, ఆశ, తిరుమలేష్, శివ శంకర్ నాయక్, సుందర్ , ఉత్తరాది విజయ్, భార్గవ్ సాయి, వినోద్, మహేంద్ర నాయక్ పాల్గొన్నారు.

దేవాలయాల బలోపేతమే ఐటిసిఎక్స్ లక్ష్యం



ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

'ఐటిసిఎక్స్ అనేది దేవాలయాలను ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేయడానికి ఉద్దేశించి ఒకప్రపంచ సమాజం అని అన్నారు. ప్రధాని నరేంద్రమోడీ వికసిత్ భారత్ 2047 దార్శనికతకు ఐటిసిఎక్స్ 2025 మద్దతు ఇస్తోందన్నారు. వసుదైవ కుటుంబ తత్వాన్ని స్వీకరించి, ఆలయ నిర్వహణలో ప్రపంచ సహకారాన్ని ఐటిసిఎక్స్ ప్రోత్సహిస్తోందన్నారు. ఎంత టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వచ్చినా మానవ సమాజాన్ని నడిపించేది ఆ దేవదేవుడేనని' మంత్రి నారా లోకేష్ అన్నారు. వాట్సాప్ ద్వారా ఆలయాల సేవలు, డ్రోన్ నిఘా వంటి సాంకేతిక ఆధారిత కార్యక్రమాలతో మన ఆధ్యాత్మిక సంప్రదాయాలను కాపాడుతూ... ఆలయాల పాలనా వ్యవస్థను ఆధునీకరించడంలో ఎపి ప్రభుత్వం ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోందని అన్నారు. తిరుపతి ఆషా కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన అంతర్జాతీయ దేవాలయాల కన్వెన్షన్ (ఐటిసిఎక్స్2025) ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. లోకేష్ మాట్లాడుతూ ఆధ్యాత్మిక పర్యాటకంలో అగ్రగామిగా ఎపి నిలుస్తుందన్నారు. మొన్నటిరోజున ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమం వద్ద మహాకుంభమేళాలో పాల్గొన్నానని, ఈరోజు తిరుపతిలోని ఆలయాల మహాకుంభ్‌లో పాలుపంచుకోవడం ఆనందంగా ఉందన్నారు. హారీ పోర్టర్ కథల కంటే మన పురాణాల్లో ఉన్న కథలు ఇంకా బాగుంటాయని పిల్లలకు వివరించాలన్నారు. సుప్రీం మాజీ న్యాయమూర్తి ఇందిరా బెనర్జీ మాట్లాడుతూ మతవిశ్వాసాలకు సంబంధించిన కేసులు, తీర్పులు, ట్రిపుల్ తలాక్ విషయాలపై ప్రసంగించారు. ఫౌండర్ గిరీష్ వాసుదేవ్ కులకర్ణిసహకరించిన జిల్లా యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంత్యోదయ ప్రతిష్ట సంస్థ నిర్వాహకురాలు నీతలాడ్, ఎంఎల్ఎలు పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎస్ విజన్‌తోనే ఐటిసిఎక్స్

ప్రసాద్‌లాడ్, మహారాష్ట్ర ప్రభుత్వ విప్, ఐటిసిఎక్స్ 2025 ఛైర్మన్

ఇంటర్నేషనల్ టెంపుల్ కన్వెన్షన్ ఎక్స్‌పో అనేది ఆర్ఎస్ఎస్ విజన్‌తో నడుస్తుంది. భక్తిభావాలను ధార్మిక కార్యక్రమాలను ఆర్ఎస్ఎస్ ఆశీర్వాదంతో విస్తరింపజేస్తూ ముందుకు తీసుకెళుతున్నాం. విలేకరి అడిగిన ప్రశ్నకు సమాధానంగా ప్రసాద్‌లాడ్ స్పందించారు.



స్విమ్స్, అరవింద్ ఐ ఆస్పత్రి మధ్య ఎంఒయు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

స్విమ్స్, ఎస్వీ అరవింద్ ఐ ఆస్పత్రితో ఎంఒయు ఒప్పందం కుదుర్చుకున్నట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు. స్విమ్స్‌లో ఎమర్జెన్సీ ట్రీట్మెంట్ సర్వీసు, లేబరేటరీ పరీక్షలు ఎస్‌వి అరవింద్ ఐ ఆస్పత్రి వారికి, ఎంబిబిఎస్, ఎంఎస్ ఆఫ్తాల్మాలజీ విద్యార్థులకు అవసరమైన శిక్షణ ఎస్‌వి అరవింద్ ఐ ఆస్పత్రిలో పొందుటకు పరస్పర సహకారాన్ని అందించుకోవాలని ఒప్పందం కుదిరింది. ఈ కార్యక్రమంలో స్విమ్స్ ఉప కులపతి డాక్టర్ ఆర్‌వి కుమార్, ఎస్‌పిఎంసిడబ్ల్యు ప్రిన్సిపాల్ డాక్టర్ ఉపాకళావత్, ఆఫ్తాల్మాలజీ విభాగాధిపతి డాక్టర్ ప్రభంజన్‌కుమార్, ఎస్‌వి అరవింద్ ఐ ఆస్పత్రి జనరల్ మేనేజర్ కె.కేశవకుమార్, పేషంట్ కేర్ మేనేజర్ జె.డమియన్ జాక్ పాల్గొన్నారు.

తెలుగుగంగ నీటికి జీవో తెస్తాం: సుధా రెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీ ప్రజలకు తెలుగు గంగ నీటిని అందించడానికి ప్రభుత్వానికి సమస్యను విన్నవించి ప్రత్యేక జీవోను తీసుకొస్తామని తెలుగు మహిళా నేత పులివర్తి సుధారెడ్డి అన్నారు. బుధవారం మంగళం పరిధిలోని తిరుమల నగర్ గ్రామపంచాయతీ మహిళలతో ప్రత్యేక ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రస్తుతం ఆర్థిక సంవత్సరానికి ముగింపులో ఉన్నామని, ఏప్రిల్ తర్వాత ప్రణాళిక బద్ధంగా అభివద్ధి కార్యక్రమాలను చేపడతామన్నారు. ఇల్లు లేని పేదలకు హౌసింగ్ స్కీం ద్వారా ఇల్లు ఇప్పించడం, అర్హులైన వారికి పింఛన్లు మంజూరు అయ్యేలా నియోజకవర్గ ఎమ్మెల్యే పులివర్తి నాని దష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. మంగళం పరిధిలో దీర్ఘకాలిక సమస్యలు ఉన్నాయని, వాటిని క్రమబద్ధంగా పరిష్కరిస్తామన్నారు. కొంతమంది తెలుగుదేశం కార్యకర్తలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని, వాటికి ఎవరూ స్పందించాల్సిన అవసరం లేదన్నారు. జయశంకర్ కాలనీలో రాజరాజేశ్వరి ఆలయాన్ని నిర్మించడానికి కాలనీ మహిళలు పులివర్తి సుధా రెడ్డికి వినతి పత్రాన్ని ఇచ్చి తగిన సహకారాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ అధ్యక్షుడు గోవిందరాజులు, కార్యదర్శి చెన్నరాయప్ప, తిరుపతి రూరల్ మండలం మహిళా అధ్యక్షురాలు మహేశ్వరి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి గోపీనాథ్, వార్డు సభ్యులు రమేష్, నాగేంద్ర, శ్రీనివాసులు పాల్గొన్నారు.



ముఖాముఖి కార్యక్రమంలో పులివర్తి సుధ

వెంకటగిరిలో ఇద్దరిపై పోక్సో కేసు?

ప్రజాశక్తి - వెంకటగిరి

పదో తరగతి విద్యార్థిని గర్భం దాల్చడంతో, తల్లి ఫిర్యాదు మేరకు ఇద్దరు నిందితులపై బుధవారం పోలీసులు పోక్సో కేసు నమోదైన ఘటన వెంకటగిరి మండలంలో చోటు చేసుకుంది. గత కొన్ని రోజులుగా బాలిక శరీరంలో మార్పులు గమనించిన తల్లి ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించింది. గర్భవతిగా నిర్ధారణ అయ్యింది. బాలికపై లైంగిక దాడి కేసులో షేక్ రబ్బానీ (38), ఎ.బాలు (33)లను ప్రాథమికంగా నిందితులుగా గుర్తించిన పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఒంటరి మహిళపై కన్నేసిన ఆ నిందితులు, బాలికపైనా పలుమార్లు లైంగిక దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది.

నరేష్‌కుమార్‌ను టిటిడి బోర్డునుంచి తొలగించాలి : సిపిఎం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యునిగా ఉండి దర్శనానికి వచ్చి, మహాద్వారం వద్ద విధులు నిర్వహిస్తున్న ఉద్యోగిపై అసభ్యపదజాలంతో దూషిస్తూ దౌర్జన్యానికి పూనుకోవడాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ఓ ప్రకటనలో ఖండించారు. బోర్డు సభ్యులు నరేష్‌కుమార్‌ను బోర్డు నుంచి తొలగించాలని డిమాండ్‌చేశారు. టిటిడి బోర్డు సభ్యులు భక్తిభావంతో సర్దిచెప్పాల్సింది పోయి, దేవస్థానం తమ సొంత జాగీరులా భావించి, ఉద్యోగులు బానిసలన్న భావనతో పవిత్ర స్థలమనే ఆలోచన లేకుండా సభ్యసమాజం, భక్తలోకం తలదించుకునేలా వ్యవహరించడాన్ని తప్పుబట్టారు. కర్నాటక రాష్ట్రానికి చెందిన ఆ బోర్డు సభ్యున్ని కఠినంగా శిక్షించాలని ఉద్యోగ కార్మిక సంఘాలు సైతం డిమాండ్ చేస్తున్నాయి. ఒకవైపు అంతర్జాతీయ దేవాలయాల కన్వెన్షన్ ఎక్స్‌పో జరుగుతుందని, మరోవైపు ముఖ్యమైన మంత్రులు తిరుపతిలో ఉన్నారని, ఈ ఘటనపై ఏమాత్రం స్పందించకపోవడం శోచనీయమన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, టిటిడి కాంట్రాక్టు ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు (సిఐటియు) టి.సుబ్రమణ్యం సంయుక్త ప్రకటనలో ఈ ఘటనను ఖండించారు.

టీటీడీపై భక్తుల ఫీడ్ బ్యాక్ బాగుంది : మంత్రి

ప్రజాశక్తి -తిరుమల

తిరుమల శ్రీవారిని రాష్ట్రమంత్రి వాసంశెట్టి సుభాష్ దర్శించుకున్నారు. వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో ఆయన స్వామివారి సేవలో పాల్గొన్నారు. టీటీడీ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం గర్భాలయంలో స్వామివారిని దర్శించుకున్న వాసంశెట్టి సుభాష్ కు రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఎనిమిది నెలల్లో శ్రీవారి ప్రసాదం నాణ్యత, ఆలయ శుభ్రత పకడ్బందీగా జరుగుతుందని మంత్రి అన్నారు. శ్రీవారి భక్తుల సౌకర్యాల పట్ల టీటీడీ ఏర్పాటు చేసిన ఫీడ్ బ్యాక్ బుక్ భరోసా ఇస్తోందన్నారు. 95 శాతం భక్తులు టీటీడీ సౌకర్యాలు బాగున్నాయని చెప్పారని, కూటమి ప్రభుత్వానికి దేవాలయాలు, భక్తుల పట్ల ఎంత చిత్తశుద్ధి ఉందో ఫీడ్ బ్యాక్ విధానం చూస్తే తెలుస్తుందన్నారు.

ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలివ్వాలి : కె.రామకృష్ణ

ప్రజాశక్తి - చంద్రగిరి

పట్టణ పేదలకు రెండు సెంట్లు ఇంటి స్థలాన్ని మంజూరు చేసి, నిర్మాణానికి 5 లక్షల రూపాయలు ఇవ్వాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. కొంగరవారిపల్లిలోని కాలనీ ఇళ్ల నిర్మాణాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. తిరుపతిలో 26వేల మంది పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి దృష్టికి తీసుకెళతామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకులు ఎ.రామానాయుడు, జిల్లా కార్యదర్శి పి.మురళి పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ సాధారణ సమావేశం గురువారం ఎస్వి సెనెట్ హాల్లో మధ్యాహ్నం 12 గంటలకు జరగనుంది. 41 అంశాలతో అజెండాను రూపొందించారు. అజెండాలో ఉన్న అంశాలు కౌన్సిల్ ఆమోదం పొందాల్సి ఉంటుంది. మేయర్ డాక్టర్ శిరీష అధ్యక్షతన సమావేశం జరగనుంది. కూటమి ప్రభుత్వంలో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో డిప్యూటీ మేయర్‌గా ఆర్సి మునికృష్ణ ఎన్నికయ్యారు. డిప్యూటీ మేయర్ హోదాలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు ఈ కౌన్సిల్ సమావేశంలో వైసిపి కార్పొరేటర్లు ప్రజా సమస్యలపై కౌన్సిల్లో ప్రశ్నించే అవకాశాలు ఉన్నాయి. ముఖ్యంగా డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో కూటమి వ్యవహరించిన తీరుపై ఎండగట్టే అవకాశం ఉంది. అటు కూటమిలో ఉన్న

డిప్యూటీ మేయర్ ఎన్నికల తర్వాత తొలి సమావేశం
ఆర్ సి మునికృష్ణ డిప్యూటీ మేయరుగా ప్రమాణ స్వీకారం

కార్పొరేటర్లు వైసిపి పాలనను తప్పు పట్టే అవకాశం లేకపోలేదు. ఇందులో స్మార్ట్ సిటీ పథకంలో గొల్లవాని గుంట క్రికెట్ స్టేడియాన్ని స్పోర్ట్స్ అథారిటీకి అప్పగించనున్నారు. అలాగే తెలుగు గంగ కాంట్రాక్ట్ కార్మికుల జీతభత్యాలు, తాగునీటి క్లోరినేషన్ పనులు, 76వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా నగరపాల సంస్థ చేపట్టిన ఏర్పాట్ల ఖర్చులు, మత్తుకేంద్రంలో పనిచేస్తున్న డాక్టర్లను, సిబ్బందిని రెన్యువల్ చేసేందుకు అజెండాలో పొందుపరిచారు. అలాగే చెత్తకు సంబంధించిన వాహనాల మరమ్మత్తులు, మాస్టర్ ప్లాన్ రోడ్లో విస్తరణ భాగంగా హీరో హెూండా షోరూమ్ ఎదురుగా ఉన్న కాటన్ మిల్ వద్ద ప్రభుత్వ స్కూలును తొలగించారు. వాటి స్థానంలో వేరే చోట ప్రహరీ నిర్మాణానికి నిధులు కేటాయించడం జరిగింది. ఇది కౌన్సిల్ ఆమోదం పొందాల్సి ఉంటుంది. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో డిప్యూటీ సిటీ ప్లానింగ్ అధికారి రెగ్యులర్ పోస్టు లేకపోవడంతో ప్రత్యేక అవసరాల కోసం డిప్యూటీ సిటీ ప్లానింగ్ అధికారికి కార్పొరేషన్ ద్వారా జీతం ఇచ్చే విధంగా కౌన్సిల్లో పెట్టారు. అలాగే వినాయక సాగర్ వద్ద ఉన్న వ్యర్థాలను తొలగించేందుకు నిధులు కేటాయింపు, నగరంలోని వివిధ పబ్లిక్ టాయిలెట్లు మరింత మెరుగుపరిచేందుకు సులభ ఇంటర్నేషనల్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్కు నిధులు చెల్లించేందుకు అజెండాలు పొందుపరిచారు. వేసవికాలంలో తాగునీటి బోర్లు మరమ్మతులు లేకుండా ఉండేందుకు వాటిని రిపేర్ చేసేందుకు నిధులను కేటాయించారు. దీన్ని కౌన్సిల్ ఆమోదించాల్సి ఉంది.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ పెంపొందించాలి

ప్రజాశక్తి - చంద్రగిరి

విద్యార్థులు ప్రాథమిక దశ నుండి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ, డేటా సైన్స్, సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యను నేర్చుకోవాలని ఎం బి యూ కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ నరేంద్ర కుమార్ అన్నారు. బుధవారం ఎంబీయూలో ఏ రంగంపేట ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ, డేటా సైన్స్ పై అవగాహన సదస్సు ముగిసింది.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ నే విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తుందన్నారు. ప్రతి విద్యార్థి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివద్ధి చేసుకోవాలని కోరారు. గ్రామీణ ప్రాంతాలలోని పేద విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ, డేటా సైన్స్, వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివద్ధి చేయడం కోసం కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం వారి ఆర్థిక సహాయంతో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. మూడు రోజులపాటు జరిగిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ, డేటా సైన్స్ పై నిర్వహించిన అవగాహన సదస్సులో ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ పద్మజ మాట్లాడుతూ కంప్యూటర్ రంగంలో వస్తున్న ఆధునిక మార్పులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానం పై ఆసక్తి పెంచుకోవాలన్నారు.

శ్రీశ్రీనివాస రామానుజ విగ్రహం ఏర్పాటు

రేణిగుంట : మండలంలోని కరకంబాడి పాఠశాలలో చదివిన విద్యార్థులు శ్రీశ్రీనివాస రామానుజ విగ్రహానికి విరాళాలను ఇచ్చి బుధవారం ప్రారంభించారు. 2001-02 విద్యా సంవత్సరం జడ్‌పి ఉన్నత పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు శివ నేతృత్వంలో విగ్రహానికి విరాళాలను సేకరించారు. అప్పటి గణిత ఉపాధ్యాయురాలు పద్మజ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ప్రధానోపాధ్యాయిని కె.పుష్పలత, గ్రామపెద్దలు బుజ్జినాయుడు, పాఠశాల యాజమాన్యం ఛైర్మన్ శ్రీనివాసులు పాల్గొన్నారు.





కుట్టు శిక్షణ సర్టిఫికెట్లు ప్రదానం

తిరుపతి టౌన్ : నవభారత్ సేవా సమాజ్ సంస్థ ఆధ్వర్యంలో చెన్నారెడ్డి కాలనీలో ఉచిత ఎంబ్రాయిడరీ, బ్యూటిషియన్ శిక్షణ పూర్తి చేసుకున్న 46 మంది మహిళలకు సర్టిఫికెట్లను మండల విద్యాశాఖాధికారిణి హేమమిలిని, రాస్, జెఎస్ఎస్ డైరెక్టర్ డాక్టర్ ఎం.మోహన్, సంస్థ ఎమ్‌డి రహముత్లా షరీఫ్ అందజేశారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని, అపుడే మహిళా సాధికారితను సాధించగలమన్నారు.

లింగనిష్పత్తి సాధికారతే లక్ష్యం

తిరుపతి టౌన్ : ఆడపిల్లల లింగనిష్పత్తి, విద్య, సాధికారతను సాధించడమే లక్ష్యంగా భేటీ బచావో..భేటీ పడావ్ పథకం ముఖ్య ఉద్దేశ్యమని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారి వసంతబాయి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కార్యక్రమం ప్రారంభించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా అధికారులతో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో డివిజన్ లెవల్ డెవలప్‌మెంట్ అధికారి జివి నారాయణరెడ్డి, పిడిడిఆర్‌డిఎ శోభన్‌బాబు, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి విక్రమ్‌రెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ అధికారి సూర్యనారాయణ పాల్గొన్నారు.

చెరువులో చేప పిల్లలు విడుదల


చెరువులో చేప పిల్లలు వదులుతున్న దృశ్యం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : పిఎంఎస్ఎస్ వై పథకం కింద చెరువులో చేప పిల్లలు వదిలే కార్యక్రమంలో భాగంగా గూడూరు లోని రావి చెరువులో బుధవారం చేప పిల్లలు వదిలారు. ఈ కార్యక్రమం ఫిషరీస్ ఆఫీసర్ మధు ఆధ్వర్యంలో రావి చెరువు నీటి సంఘం ఉపాధ్యక్షులు మయూరి శ్యామ్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టిడిపి మండల అధ్యక్షులు కొండూరు వెంకటేశ్వరరాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రావి చెరువు నీటి సంఘం సభ్యుడు యదనబర్తి దయాకర్ రెడ్డి , మత్స్యకారులు , టిడిపి నాయకులు , కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

మంత్రి లోకేష్‌ను కలిసిన ఎమ్మెల్యే


మంత్రి లోకేష్‌ను కలిసిన ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

ప్రజాశక్తి - పిచ్చాటూరు: తిరుపతిలో పర్యటన నిమిత్తం బుధవారం రేణిగుంట విమానాశ్రయానికి విచ్చేసిన మంత్రి నారా లోకేష్‌ని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మర్యాద పూర్వకంగా కలిశారు. త్వరలోనే సత్యవేడు నియోజక వర్గానికి మంచి చేకూరి అభివృద్ధి ముందడుగు వేస్తారని మంత్రి తెలిపారని ఎమ్మెల్యే ఆనందం వ్యక్తం చేశారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు


అలరిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గాడ్రాంగ్ వెంకటేశ్వర స్వామి గుడి ప్రాంగణంలో ఉన్న సాయి విద్యానికేతన్ పాఠశాల నాలుగవ వార్షికోత్సవం డిఎన్ఆర్ కమ్యూనిటీ హాలులో బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్వీ బీవీడీ కళాశాల డైరెక్టర్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఇంత చక్కటి వాతావరణంలో పాఠశాల వార్షికోత్సవం జరుపుకోవడం చాలా ఆనందదాయకంగా వుందన్నారు. విద్యతోనే ఉన్నత శిఖరాలను అధిరోహించ వచ్చని ఇందుకు కృషి చేయాలన్నారు. పాఠశాలలో క్లాస్ టాపర్లు అయిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. పాఠశాల కరస్పాండెంట్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తమ పాఠశాల తల్లిదండ్రుల సహకారంతో 200 మంది విద్యార్థులతో ప్రారంభమైన ఇప్పుడు 900 విద్యార్థులతో ముందుకు వెళుతోందన్నారు. ఇదే స్ఫూర్తితో చిల్లకూరులో సాయి విద్యానికేతన్ జూనియర్ కళాశాల, పొదలకూరులో ఎస్వీ బీవీడీ కళాశాల, వచ్చే సంవత్సరం నుండి వర్ధన్ రెడ్డి గ్రూప్ ఆఫ్ కళాశాలలోనూ సాయి విద్యానికేతన్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహి స్తామన్నారు. ముందుందు సాయి విద్యానికేతన్ విద్యాసంస్థలపై అందరి సలహా, సమాయ సహకారాలు అందేలా ఆశీర్వచనం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యా యురాలు శ్రావణి , దయాకర్ , పాఠశాల ఉపాధ్యాయులు తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.


శివాజీ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న మరాఠా అసోసియేషన్ నాయకులు

ఛత్రపతి శివాజీ భావి తరాలకు స్ఫూర్తి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పరాయి రాజుల సామ్రాజ్య కాంక్షను అడ్డుకొని, ముష్కరుల అతి కిరాతక దాడులను సమర్థవంతంగా ఎదుర్కొని భరతభూమికి రక్షణగా నిలిచిన ఛత్రపతి శివాజీ మహరాజ్ భావితరాలకు స్ఫూర్తి అని శ్రీకాళహస్తి మరాఠా అసోసియేషన్ నాయకులు, పివిఆర్‌గ్రూప్ డైరెక్టర్ జనార్ధన రావు జె పవార్ కొనియాడారు. ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతిని మరాఠా అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. మరాఠా అసోసియేషన్ నాయకులు సత్యనారాయణ, మహేశ్వర రావు, ఎన్.భాస్కర్ రావు, దయానంద రావు, సదారాం, హరిరావు, రాజ శేఖర్, కిరణ్, ప్రసన్న రావు, గోవర్ధన్, నరసింహారావు పాల్గొన్నారు.

క్యాంపస్ : ఛత్రపతి శివాజీ జయంతి ఉత్సవాలను చరిత్ర విభాగం ఆధ్వర్యంలో ఎస్‌జిఎస్ ఆర్ట్స్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి సత్యనారాయణ విచ్చేశారు. శివాజీ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో చరిత్ర విభాగం అధ్యక్షులు కత్తి భాస్కరన్, అధ్యాపకులు జే కొండలరావు చంద్రయ్య, వెంకట రమణమ్మ, ఎస్ అనిల్ కుమార్, ప్రదారెడ్డి, ప్రియాసింగ్, వి. మని, ఎన్ వినోద్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు గుండె వ్యాధి నిపుణులు డాక్టర్ జయరామ్ రాక

ప్రజాశక్తి -కోట : నెల్లూరు మెడికవర్ హాస్పిటల్ నుండి ప్రముఖ గుండె వ్యాధి నిపుణులు డాక్టర్ జయరాంమ్ గురువారం కోట మండలంలోని జనతా క్లినిక్ హాస్పిటల్ కు ఉదయం 10 గంటలకు రానున్నట్లు జనతా క్లినిక్ హాస్పిటల్ డాక్టర్ మల్లి జగదీష్, డాక్టర్ ఉమేరాలు తెలిపారు. బుధవారం డాక్టర్ ఎమ్ జగదీష్ మాట్లాడుతూ కోట మండలంలోని ఎన్‌సి ఆర్ నగర్‌లోని జనతా క్లినిక్ హాస్పిటల్‌లో గుండె వ్యాధి చికిత్స లు నిర్వహిస్తారని తెలిపారు. ఇలాంటి మంచి అవకాశాన్ని కోట, వాకాడు, చిట్ట మూరు, చిల్లకూరు మండలాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విష జ్వరాల బెడద

పాలకొండ సత్రం వాసులు గజగజ

ప్రజాశక్తి- వెంకటగిరి టౌన్: వెంకటగిరి మండలం పాలకొండ సత్రంగ్రామంలో విష జ్వరాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. చేతిపంపు బోరు నుండి సుద్ధ నీరు వస్తుండడంతో వాటర్ కలుషితం అవుతోందని గ్రామ ప్రజలు పేర్కొంటున్నారు. గ్రామంలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉండడం వల్ల తాగునీరు కలుషితమై విష జ్వరాల వ్యాప్తికి కారణమవుతోందని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు స్పందించి పారిశుధ్యాన్ని మెరుగుపరిచి విష జ్వరాల బెడద నుండి ప్రజలను వెంటనే కాపాడాల్సిన అవసరం వుంది.

మంచు కాలం జర భద్రం..!


వృద్ధులకు, చిన్నారులకు వైద్యుల హెచ్చరిక

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: ప్రస్తుతం కురుస్తున్న మంచుకు వృద్ధులు, చిన్నారులు జర భద్రంగా వుండాలని ఉండాలని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. చలి గాలులు వీస్తుండడంతో పాటు ఉదయం దట్టమైన పొగ మంచు కమ్ముకొంటోంది. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, వివిధ పనుల నిమిత్తం వెళ్లే ప్రజలు, కూలీలు చలికాలంలో ఆరోగ్య విషయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని వైద్యులు పేర్కొంటున్నారు. ఉదయాన్నే వాకింగ్, , జాగింగ్ చేసేవారు ప్రత్యేకమైన జాగ్రత్తలు తీసుకోవాలని, లేకుంటే జబ్బుల బారిన పడాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. ఆస్తమా ఉన్నవారు శీతాకాలంలో వాకింగ్‌కు వెళ్లకపోవడమే మంచిదని, చలి తీవ్రత పెరిగే కొద్దీ శ్వాసకోశ వ్యాధులు సోకే ప్రమాదం ఉండటంతో ఉదయాన్నే బయటకు వెళ్లకపోవడం మంచిదని సూచిస్తున్నారు. వ్యక్తిగత పరిశుభ్రత ఎంత ముఖ్యమో పరిసరాల పరిశుభ్రత అంతే ముఖ్య మని, శీతాకాలంలో దోమల వ్యాప్తి ఎక్కువగా ఉంటుందని, ఈ కారణంగా టైఫాయిడ్, మలేరియా, చికెన్ గున్యా మెదడు వాపు, విష జ్వరాలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందని పేర్కొంటున్నారు. తాగునీటి విషయంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగడం ఎంతో శ్రేయస్కరమని, వేడి వేడి ఆహార పదార్థాలను తీసుకోవడం మంచిదని వైద్య నిపుణులు తెలిపారు. వంట పాత్రలపై మూతలు పెట్టాలని, దోమతెరలు వాడాలని, దీర్ఘకాలిక వ్యాధులున్న వారు జాగ్రత్తలు పాటించాలి గుండె సంబంధిత వ్యాధులతో బాధపడేవారు జ్వరం దగ్గు ఉన్నవారు, దగ్గు, జ్వరం ఉన్నవారు వెచ్చని వాతావరణంలో ఉండేలా చూసుకోవాలని, వృద్ధులు, చిన్నారులతో పాటు అన్ని వయస్సుల వారు తమకు అనుగుణంగా స్వెటర్లు, మంకీ క్యాప్‌లు జర్కిన్‌లు ధరించడం ఉత్తమం, శీతల పానీయాలకు, ఐస్ క్రీమ్ లకు దూరంగా ఉంటూ బయటకు వెళ్లినప్పుడు చెవుల్లో దూదిని పెట్టుకుని వెళ్లడం మంచిదని సూచించారు. శీతాకాలం ముగిసే వరకు ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో ఉత్తమం అని పేర్కొన్నారు.

సాంకేతిక పరిజ్ఞాన విద్యను అలవర్చుకోవాలి

డాక్టర్ ఎండి సలావుద్దీన్

ప్రజాశక్తి -రామచంద్రపురం: నేటి ఆధునిక సమాజంలో సాంకేతిక పరిజ్ఞాన విద్యను అలవర్చుకుంటే ఫార్మసీ రంగంలో నూతన ఔషధాలు తయారు చేయవచ్చని బెంగళూరుకు చెందిన ఆల్ అమీన్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎండి సలావుద్దీన్ అన్నారు. వెంకట్రామాపురంలోని సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాలలో డ్రగ్ డిస్కవరీ అండ్ డెవలప్‌మెంట్‌కు ఆధునిక సాంకేతిక పద్ధతిలో పై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మసీ రంగంలో విద్యార్థులు కష్టపడి చదివి సాంకేతిక పరిశోధనలు చేస్తే మంచి ఔషధాల ఆవిష్కరణ అవుతున్నాయన్నారు. ఔషధాల రంగంలో ఫార్మసిస్టులదే కీలక పాత్ర అన్నారు. సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం నిరంజన్ బాబు మాట్లాడుతూ విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై అడుగులు వేయాలని పిలుపు నిచ్చారు. అనంతరం డాక్టర్ ఎండి సలావుద్దీన్, కళాశాల యాజ మాన్యం దుశ్శాలువతో ఘనం గా సన్మానించి జ్ఞాపికలు అందించారు. ఈ కార్యక్రమం లో కళాశాల అకాడమిక్ అడ్మినిస్ట్రేటర్ లక్ష్మయ్య, వైస్ ప్రిన్సిపల్ ప్రసన్నరాజు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థినివిద్యార్థులు పాల్గొన్నారు


డాక్టరు ఎండి సలావుద్దీన్‌ను సన్మానిస్తున్న సెవెన్ హిల్స్ ఫార్మసి కళాశాల యాజమాన్యం

చిన్నశేషవాహనంపై కల్యాణ వెంకన్న విహారం

ప్రజాశక్తి -చంద్రగిరి: మండలంలోని శ్రీనివాస మంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో రెండో రోజు బుధవారం ఉదయం 8 గంటలకు శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి వేణు గోపాల కృష్ణుడి అలంకారంలో చిన్నశేష వాహనంపై విహరించారు. బుధవారం తెల్లవారుజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, మూలవిరాట్‌కు వివిధ రకాల అభిషేకాలు నిర్వహించి బంగారు ఆభరణాలు, పుష్పాలతో విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఉదయం 8 గంటలకు కళ్యాణ వెంకన్న ఉత్సవ విగ్రహాన్ని చిన్న శేష వాహనంపై అధిష్ఠింపజేసి విశేషంగా అలంకరించారు. మంగళ వాయిద్యాలు, వేదమంత్రాలు, భక్త భజనలు మధ్య ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన భక్తజన బృందాల కోలాటాలు, చెక్కభజనలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

హంస వాహనంపై కళ్యాణ వెంకన్న విహారం

కళ్యాణ వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవ రోజు బుధవారం రాత్రి 7 నుండి 8 గంటల వరకు హంస వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారి బ్రహ్మోత్సవాలకు హాజరైన భక్తులకు టిటిడి అన్న ప్రసాదాలు అందించింది. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వరలక్ష్మి, వైఖానస ఆగమ సలహాదారులు మోహన రంగాచార్యులు, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, ఆలయ అర్చకులు బాలాజి రంగాచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు మునికుమార్, ధనశేఖర్, ఇతర అధికారులు, పాల్గొన్నారు.

బీసీ కాపు కార్పొరేషన్ ఉపాధికి 29 మంది ఎంపిక

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో బుధవారం బీసీ కార్పొరేషన్ కాపు కార్పొరేషన్ స్వయం ఉపాధికి 29 మందిని ఎంపిక చేశారు. మొత్తం 300 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోగా వారిలో 255 మంది హాజరయ్యారు. ఈ లబ్ధిదారుల ఎంపికకు ఎంపీడీవో త్రివిక్రమరావు, శ్రీకాళహస్తి, సప్తగిరి గ్రామీణ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ రవికుమార్, బుచ్చినాయుడు కండ్రిగ సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజర్ వి రమణ, స్టేట్ బ్యాంక్ మేనేజర్ మోహన్, నాయకుల ఆధ్వర్యంలో లబ్ధిదారులకు ఎంపిక చేశారు. ఈ ఎంపికలు స్టేట్ బ్యాంకుకు 18 మందిని ఎంపిక చేయగా గ్రామీణ బ్యాంకు 11 మందిని ఎంపిక చేసినట్లు బ్యాంకు సిబ్బంది తెలిపారు. ఎన్నికైన లబ్ధిదారులకు త్వరలో వారి వారి ఫోన్ నెంబర్లకు మెసేజ్లు పంపుతామని మెసేజ్ లు వచ్చిన వెంటనే ఆయా బ్యాంకు అధికారుల్ని కలవాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఎంపీడీవో సిబ్బంది బ్యాంక్ అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.


బిసి కాపు కార్పరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

పరీక్షా ఫలితాలు వెంటనే విడుదల చేయాలి : ఎస్‌ఎఫ్‌ఐ



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో సెమిస్టర్ ఫలితాల విడుదలలో జాప్యం చేయడం తగదని, విద్యార్థుల్లో ఆందోళన కలిగిస్తోందని, వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ నేతలు పేర్కొన్నారు. ఎస్వియూ ఇన్‌ఛార్జి విసి ఆచార్య సిహెచ్ అప్పారావుకి ఎస్‌ఎఫ్‌ఐ నేతలు బుధవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వర్సిటీ అధ్యక్ష కార్యదర్శులు నరేంద్ర, వినోద్ మాట్లాడుతూ పెండింగ్‌లో వున్న డిగ్రీ, పిజి 1,2,3 సెమిస్టర్ల ఫలితా లు త్వరగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పీజీ, సెకండి యర్ చదువుతున్న విద్యార్థులు రెండవ సెమిస్టర్ రాసి దాదాపుగా ఏడు నెలలకు కావస్తున్న ఇప్పటికీ ఫలితాలు విడుదల చేయలేదని విమర్శించారు. దీనివల్ల రెండవ సెమిస్టర్ ఫలితాలు విడుదల కాక పోవడంతో మిగతా 3, 4 సెమిస్టర్ ఫలితాలు ఎప్పటికీ విడుదల అవుతాయనే ఆందోళన విద్యార్థుల్లో నెలకొందన్నారు. ఫలితాలు వచ్చినా రివాల్యుయేషన్ పరీక్ష ఫలితాలు కూడా దాదాపు సంవత్సరం కాలం పూర్తయినా విడుదల చేయకపో వడం దారుణ మన్నారు. పరీక్షా ఫలితాలు వెలు వడిన వెంటనే ఒక వారం రోజుల్లో రివాల్యుయేషన్‌కి విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటా రని అప్పటి నుంచి రెండు వారాల్లో, లేదా నెల రోజులకు వేసిన ఫలితా లను విద్యార్థులకు అందేలా కృషి చేయాలని కోరారు. మారిన రెండు వారాలు నెల రోజుల్లో లోపల ఫలితా లు విడుదల చేయాలని కోరా రు. అలా కాకుండా జాప్యం చేయడం వల్ల విద్యార్థులకు రివాల్యుయేషన్ ఫలితాల విడుదలపె నమ్మకం పో తోం దన్నారు. ఫలితాలు జాప్యం వల్ల ఉన్నత విద్య పీజీ ఇతర కోర్సుల అడ్మిషన్లలో అవసరమైన ఫలితా లు లేకపోవడం వల్ల విద్యార్థులు మంచి అవకాశాలు కోల్పో తారన్నారన్నారు. వెంటనే ఫలితాలు విడుదల చేయా లని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మధు, సాయి, జగదీష్, సాయి సతీష్, హాసిని లు పాల్గొన్నారు.


కేంద్ర మంత్రి పెమ్మసాని దంపతులకు ముక్కంటి చిత్ర పటాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్

శ్రీకాళహస్తి అభివృద్ధికి తోడ్పాటు

- కేంద్ర మంత్రి పెమ్మసాని

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన సహకారాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నానని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ హామీ ఇచ్చారు. పెమ్మసాని బుధవారం కుటుంబ సమేతంగా శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి స్వగ్రామం ఊరందూరుకు విచ్చేశారు. అక్కడ బొజ్జల కుటుంబ సభ్యులతో కలిసి అల్పాహారం తిన్నారు. అనంతరం బొజ్జల కుటుంబ సభ్యులతో కలిసి ముక్కంటిని దర్శించుకున్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లలో సుధీర్ రెడ్డి చేస్తున్న కృషిని ఈ సందర్భంగా అభినందించారు. శ్రీకాళహస్తి ఆధ్యాత్మిక క్షేత్రంగా, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందడానికి అవసరమైన సాయాన్ని కేంద్రం నుంచి అందేలా చొరవ చూపుతానని పెమ్మసాని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల పూర్తికి, మౌలిక సదుపాయాలు మరింత పెంచడానికి అవసరమైన నిధులను మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు.

జ్ఞాన జ్యోతి శిక్షణా తరగతుల తనిఖీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రారంభమైన జ్ఞాన జ్యోతి ఆరు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని జిల్లా సెక్టోరల్ ఆఫీసర్ కేడి సారధి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాల్ట్(సపోర్టివ్ ఆంధ్ర లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ శిక్షణలో భాగంగా 120 రోజుల శిక్షణలో తొలి విడత కార్యక్రమానికి మండలంలోని ఐసిడిఎస్, అంగన్‌వాడీ కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న వయసులోనే ప్రతి ఒక్కరికీ ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసి అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్స్ ను తయారు చేసుకొని విద్యార్థులకు సులభం బోధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ఎంఈవో బి తిరుమల రాజు, బాలసుబ్రహ్మణ్యం, ఇన్‌ఛార్జి సిడిపిఓ సంధ్య , ఐసిడిఎస్ సూపరువైజర్లు అనిత, గీతాంజ లి, డి ఆర్ పి రమేష్, వెంకటేశు, భూపతి , సీ ఆర్ పిలు పాల్గొన్నారు.


జ్ఞాన జ్యోతి శిక్షణా తరగతులను తనిఖీ చేస్తున్న ఎంఈవోలు

వైభవంగా పల్లికొండేశ్వరుని పల్లకి సేవ

ప్రజాశక్తి -నాగలాపురం: నాగలాపురం మండలం సురుటుపల్లిలో ప్రదోష క్షేత్రంగా బాసిల్లుతున్న శ్రీ మంగళా దేవి సమేత పల్లికొండేశ్వరస్వామి ఆలయంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల వాహన సేవలు వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. బుధవారం ఉదయం వృషభ లగ్నంలో ఆలయ ప్రధాన అర్చకులు కార్తికేయ గురుకుల్ ఆధ్వర్యంలో అర్చకుల వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలు నడుమ ఆలయ ధ్వజ స్తంభం పై నందీశ్వరుని పటాన్ని అధిరోహించి ధ్వజారోహణ క్రతువు ద్వారా ముక్కోటి దేవతలకు ఆహ్వానం పలికారు. సాయంత్రం ఆలయంలో ప్రత్యేక ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. తొలిరోజు పల్లకి సేవ ఉభయదారుగా మాజీ ఎమ్మెల్సీ కందేరి జయచంద్ర నాయుడు కుటుంబ సభ్యులు వ్యవహరించారు. కోలాట భజనలు, చిన్నారుల భరతనాట్యం ఆకర్షణగా నిలిచింది. విద్యుద్దీపాలంకరణలు, దేవతామూర్తుల విద్యుత్ కటౌట్ లు భక్తులను ఆకట్టుకుంది. శివరాత్రి బ్రహ్మోత్సవ ఏర్పాట్లను ఆలయ ఈఓ లత, సిబ్బంది దండపాణి, పరంధాం పర్యవేక్షించారు.



క్రైం న్యూస్

వలస కూలీ ఆత్మహత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి- తిరుపతి : వలస కూలి ఉరివేసుకొని ఆత్మ హత్య చేసుకున్న ఘటన తిరుపతిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ఉత్తరప్రదేశ్ , మహారాజ్ గంజ్ జిల్లా , భరత్ గడ గ్రామానికి చెందిన అనర్జిత్(28) తిరుపతి రూరల్ వెంకటపతి నగర్ లో నివాసం ఉంటున్నాడు. తిరుపతి ప్రాంతాలలో 8 సంవత్సరాలుగా పెయింటర్‌గా కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసైన అతను, కుటుంబ సమస్యల నేపథ్యంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. మృతుడు తమ్ముడు రాహ్మిత్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమితం రుయా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు నూకతోటి రాజేష్ పుట్టినరోజు వేడుకలు



నూకతోటి రాజేష్‌కు పుష్ప గుచ్ఛం అందిస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి. బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో బుచ్చినాయుడు కండ్రిగ వైసిపి మండల కన్వీనర్ మణి నాయుడు ఆధ్వర్యంలో సత్యవేడు వైసిపి ఇన్‌ఛార్జి నూక తోటి రాజేష్ జన్మదిన వేడుకలు బుచ్చినాయుడు కండ్రిగ వైసిపి కార్యాలయంలో నేడు గురువారం ఘనంగా నిర్వహిస్తున్నామని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఈ జన్మదిన వేడుకలకు మండలంలోని వైసిపి సీనియర్ నాయకులు కార్యకర్తలు గురువారం ఉదయం 9 గంటలకు బి ఎన్ కండ్రిగ సర్కిల్లో వైసిపి కార్యాలయానికి హాజరుకావాలని మండల కన్వీనర్ మణి నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమానికి వైసిపి నాయకులు, యువకులు వైసిపి కార్యకర్తలు పాల్గొనాలని ఆ పార్టీ నాయకులకు సూచించారు.


ఎస్వియు ఇన్‌ఛార్జి విసిని కలిసిన అంతర్జాతీయ పోటీకి ఎంపికైన విద్యార్థినులు

'అన్వేషణ - 25' కు ఎస్వీయూ బృందం

ప్రజాశక్తి - క్యాంపస్ : కర్ణాటక రాష్ట్ర రామయ్య విశ్వవిద్యాలయంలో నిర్వహించే "శాస్త్రీయ పరిశోధన, ఆవిష్కరణల అంతర్జాతీయ విద్యార్థులు పోటీకి కల్చరల్ కోఆర్డినేటర్ పత్తిపాటి వివేక్ ఆధ్వర్యంలో సంజయ్ కుమార్, భవ్య శ్రీ, దీప్తి, జాస్మిన్‌ల బృందం బుధవారం బెంగళూరుకి పయనమైంది. ఈ బృందం ఎస్వియు ఇన్‌ఛార్జి విసి ఆచార్య అప్పారావును ఆయన చాంబర్లో మర్యాదపూర్వకం గా కలిశారు. ఈ సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలుపుతూ పోటీలో విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పద్మావతి మహిళా కళాశాల ప్రిన్సిపాల్ భువనేశ్వరి, పాకనాటి హరికృష్ణ, అధ్యాపకులు కుసుమ, శరత్ బాబు పాల్గొన్నారు.


సోమశేఖర్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

వైసిపి నేతకు పరామర్శ

ప్రజాశక్తి-నాయుడుపేట: వైసిపి తిరుపతి జిల్లా ఉపాధ్యక్షులు మద్దాలి సోమశేఖర్ రెడ్డిని బుధవారం సాయంత్రం ఆయన నివాసంలో మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య స్థానిక వైసిపి నాయకులతో కలిసి పరామర్శించారు. బుధవారం పెళ్లకూరు మండలం ఎగువచావాలి వద్ద మద్దాలి సోమ శేఖర్ రెడ్డి ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, మాజీ ఎన్ డీసీసీబీ ఛైర్మన్ కామిరెడ్డి, సత్యనారాయణ రెడ్డి, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు తంబిరెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, పార్టీ నాయకులతో కలిసి నాయుడుపేటలోని మద్దాలి సోమశేఖర్ రెడ్డి నివాసానికి చేరుకుని పరామర్శించారు. వైసిపి నాయకులు బైనా మల్లికార్జునరెడ్డి, లింగారెడ్డి సురేష్ రెడ్డి, పలువురు నాయకులు సోమశేఖర్ రెడ్డిని పరామర్శించారు.

పేదరిక నిర్మూలనపై సర్వే: కమిషనర్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: ఆంధ్రప్రదేశ్‌లో పేదరిక నిర్మూలనకు పి4 సర్వే యాప్ ద్వారా సర్వే నిర్వహించ నున్నట్లు (పబ్లిక్ ప్రైవేట్ ప్యూపెల్ పార్టనర్షిప్) పాలసీని త్వరలో ప్రభుత్వ ప్రవేశపెట్టనుందని పుత్తూరు మున్సిపల్ కమిషనర్ మంజునాథ గౌడ్ పేర్కొన్నారు. వార్డు సచి వాలయాల కార్యదర్శులతో బుధవారం ఆయన సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అట్టడుగు పేదలను గుర్తించేందుకు పి 4 సర్వేయాప్‌పై గ్రామ, వార్డ్ సచివాలయ ఉద్యోగులకు ఏఎస్ఓ చల్లా మునికృష్ణయ్య శిక్షణ ఇచ్చారు. ఎంపిడివో రమేష్ బాబు మాట్లాడుతూ ఈ సర్వే ఈ నెల 20వ తేదీ నుండి మార్చి 2వ తేదీ వరకు నిర్వహిస్తారని మండలం, మున్సిపాల్టీ పరిధిలోని అన్ని సచివాలయాలలో జరుగు తుందని, ఎలాంటి తప్పులు లేకుండా సర్వే చేయాలని గ్రామ, వార్డ్ సచివాలయ ఉద్యోగులకు సూచిం చారు. ఈ కార్యక్రమములో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు, కార్యాలయ సిబ్బంది ఏ ఇ కార్తికేయన్ పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం


అన్నదానం చేస్తున్న విద్యుత్ యూనియన్‌నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : విద్యుత్ శాఖలో పని చేస్తూ 11/4 యూనియన్ డివిజనల్ కార్యదర్శి అయిన ఎం పాండురంగయ్య ఏడాది క్రితం మృతి చెందారు. బుధవారం ఆయన ప్రథమ వర్ధంతి సందర్భంగా తన తోటి విద్యుత్ కార్మికులు, యూనియన్ నాయకులు కలిసి స్థానిక కార్వేటి నగరం రోడ్డులో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. మధ్యాహ్నం పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ 11/4 యూనియన్ డివిజనల్ అధ్యక్షుడు చక్రపాణి మాట్లాడుతూ పాండు రంగయ్య కార్మికుల కోసం అనేక పోరాటా లు చేసి వాళ్ల సమస్యలు పరిష్కరించే గొప్ప వ్యక్తి లేకపోవడం బాధా కరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ప్రభాకర్, పద్మనాభం, హరికృష్ణ, కుమార్, శ్రీనివాసులు, ఓంకార్, కార్మికులు పాల్గొన్నారు.

తుడా అభివృద్ధి పనులు వేగవంతం చేయండి: మంత్రి నారాయణ

ప్రజాశక్తి తిరుపతి టౌన్: తిరుపతి అర్బన్ డెవలప్మెంట్ పరిధిలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని మంత్రి నారాయణ అధికారులను ఆదేశించారు. సీఎం చంద్రబాబు ఆదేశాలతో తుడా అధికారులతో మంత్రి నారాయణ బుధవారం సమీక్ష చేశారు..విజయవాడలోని సీఆర్డీయే కార్యాలయంలో నిర్వహించిన సమీక్షకు పురపాలక శాఖ కమిషనర్, డైరెక్టర్ సంపత్ కుమార్ , తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, తుడా వైస్ చైర్మన్ మౌర్య, పట్టణ ప్రణాళిక విభాగం డైరెక్టర్ విద్యుల్లత తో పాటు తుడా అధికారులు హాజరయ్యారు. తుడాకు వస్తున్న రెవెన్యూ, ఖర్చుల వివరాలు మంత్రి అడిగి తెలుసుకున్నారు... రెవెన్యూ పెంపునకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. తుడా పరిధిలో భూములను అభివృద్ధి చేయడం ద్వారా ఆదాయం పెంపుపై దృష్టి సారించాలని సూచించారు. అవసరమైతే పీపీపీ విధానంలో భూములను అభివృద్ధి చేసి అమ్మకాలు చేయడం ద్వారా ఆదాయం పెంచుకు నేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీనిద్వారా అథారిటీ పై భారం తగ్గుతుందన్నారు.పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యంతో లే అవుట్ లలో హౌసింగ్ ప్రాజెక్టుల ను చేపట్టాలని మంత్రి సూచించారు. మరోవైపు తిరుపతి అర్బన్ డెవలప్మెంట్ పరిధిలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లోని గ్రామపంచాయతీ ల్లో కనీస మౌలిక వసతుల కల్పన కు అవసరమైన నిధులను తుడా నుంచి విడుదల చేయాలని మంత్రి ఆదేశించారు. తిరుపతిలో 3.61ఎకరాల్లో జీ౦ 13 అంతస్తుల్లో నిర్మిస్తున్న తుడా టవర్స్ పనులపైనా మంత్రి వివరాలు అడిగి తెలుసుకున్నారు...తిరుపతి నగరానికి తలమానికంగా ఉండేలా టవర్స్ నిర్మాణం చేపట్టాలని సూచించారు. టెంపుల్సిటీ తిరుపతిలో పరిశుభ్రత, సుందరీకరణకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి నారాయణ అధికారులను సూచించారు. తుడా టవర్స్ బ్రోచర్‌ను మంత్రి నారాయణ ఆవిష్కరించారు.

అభివృద్ధి కోసం ఆదాయపు పన్ను కట్టాలి

ఐటీ అధికారుల అవగాహనా సదస్సు

ప్రజాశక్తి-సూళ్లూరుపేట: ఆదాయానికి అనుగుణంగా ఇన్‌కంటాక్స్ చెల్లించడం ద్వారా దేశ అభివృద్ధిని సాధించవచ్చునని ఈ అభివృద్ధి తిరిగి మనకే ఉపయోగపడుతుందని ప్రతి ఒక్కరూ గుర్తించాలని తిరుపతి ఒకటవ రేంజ్ ఇంకంటాక్స్ అడిషినల్ కమిషనర్ వంశీధర్ అన్నారు. సూళ్లూరుపేట లోని ఆర్యవైశ్య కళ్యాణ మండపం లో బుధవారం మునిసిపల్ వైస్ ప్రెసిడెంట్ చిన్ని సత్యనారాయణ సహాయ సహకారాలతో ఆదాయపు పన్నుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వంశీధర్ మాట్లాడుతూ మనిషి మానసికంగా, శారీరకంగా ఎలా ఆరోగ్యంగా ఉండాలనుకుంటారో దేశానికీ కూడా ఆర్థికపరమైన అనారోగ్యం రాకుండా చూసుకోవాలని తెలిపారు. అనంతరం పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వ్యాపారులకు ఆదాయపు పన్ను చెల్లింపుల పైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆదాయపు పన్ను శాఖ అధికారి మోహన్ కృష్ణ, స్థానిక వ్యాపార సంఘాలకు చెందిన వాకిచర్ల శాంతరావు, భాస్కరాచారి, పాల్గొన్నారు.

మత్స్యకారుల అభివృద్ధే లక్ష్యం

తిరుపతి పార్లమెంట్ మైనార్టీ నాయకులు షేక్ జలీల్ అహ్మద్

ప్రజాశక్తి -కోట : మత్స్యకారులను అభివృద్ధి మార్గంలో నడిపించడానికి కూటమి ప్రభుత్వ లక్ష్యమని తిరుపతి పార్లమెంట్ మైనార్టీ అధ్యక్షులు షేక్ జలీల్ అహ్మద్, నెల్లూరు మోహన్ రెడ్డిలు అన్నారు. బుధవారం కోట మండలంలోని నెల్లూరు పల్లి కొత్తపాలెం పెన్నక్క చెరువులో 12 లక్షల చేప పిల్లలను వదిలారు. అనంతరం షేక్ జలీల్ అహ్మద్, నెల్లూరు మోహన్ రెడ్డి లు మాట్లాడుతూ కోట మండలం నెల్లూరుపల్లి కొత్తపాలెంలో గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్ ఆదేశాల మేరకు పిఎమ్ఎమ్ఎస్‌వై ద్వారా 2024-25 సంవత్సరానికి నెల్లూరు పల్లి కొత్తపాళెం చెరువుకు నూతనంగా ఎన్నికైన తిరుపతి జిల్లా రైతు కార్యదర్శి నెల్లూరు మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో 12 లక్షల చేప పిల్లలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కోట మండలం తహశీల్దారు కే జేజే రావు, ఎంపీడీవో వేణు, తిరుపతి పార్లమెంట్ మైనార్టీ అధ్యక్షులు షేక్ జలీల్ అహ్మద్, టిడిపి సీనియర్ నాయకులు పలగాటి భాస్కర్ రెడ్డి, మారం రెడ్డి శ్రీధర్ రెడ్డి, దశరథ రామిరెడ్డి, ఎంపీటీసీ దారా సురేష్, షంషుద్దీన్, పలగాటి జితేంద్ర రెడ్డి, కోకర్ల మధు యాదవ్, నౌషద్, బాబు, సిద్ధపరెడ్డి పోలమ్మ, సుహాసిని, నీలు, టిడిపి సోషల్ మీడియా మీజురు మధుబాబు, రూపేష్ , నీలేష్, నెల్లూరు పల్లి కొత్తపాలెం చెరువు కమిటీ నాయకులు మత్స్యకార జిల్లా అధికారులు నాగరాజు, స్థానిక మండల మత్స్యశాఖ అధికారి రెడ్యా నాయక్, గ్రామ ప్రజలు శానంపూడి గోపాల్ రెడ్డి, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తిరుపతి పార్లమెంట్ మైనార్టీ నాయకులు షేక్.జలీల్ అహ్మద్

మురుగు గుంతల్లో దోమలు

- సాయంత్రం వేళ స్వైర విహారం
- జ్వరాలు వ్యాపిస్తాయని ప్రజలు ఆందోళన

ప్రజాశక్తి- బాలాయపల్లి:

జయంబు హరిజనవాడలో సైడ్ కాలవలు మురికి గుంతలుగా మారాయి. గత ఐదు సంవత్సరాలుగా ఇవి ఇలాగే వున్నాయి. ఆ మురుగు గుంతల్లో దోమలు, ఇతర కీటకాలు అధికమయ్యాయి. ఈ కీటకాలు సాయంత్రం కాగానే పిల్లలను, పెద్దలను కరుస్తున్నాయి. వాటి బారిన పడి అనేక మంది విష జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామంలోని ప్రతి వీధి పరిస్థితి ఇలాగే వుందని స్థానికులు వాపోతున్నారు. నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఏమయ్యాయో తెలియడం లేదని వారు ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి తమను ఆదుకోవాలని గ్రామస్తులు ఆదుకోవాలని కోరుతున్నారు.



టిడిపిలోకి వైసీపీ ఉప సర్పంచ్, కార్యకర్తలు



టిడిపిలో చేరుతున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : చిత్తూరు రూరల్ మండలం తొప్పాతిపల్లి గ్రామ పంచాయతీకి చెందిన వైసిపి ఉప సర్పంచ్, మరో నలుగురు కార్యకర్తలు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ నివాసంలో ఉప సర్పంచ్ జి మణి, బాలకృష్ణారెడ్డి (మర్రిగుంత), కె.రవి (తొప్పాతిపల్లి), చిట్టి, మోహన్ (గుడ్లపల్లి) టిడిపి విధానాలు, రాష్ట్రంలో కూటమి ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి, ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ అభివృద్ధి నినాదం నచ్చి ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ సమక్షంలో టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మునిరత్నం, టిడిపి బూత్ కమిటీ కన్వీనర్ కాటమరాజు, నాయకులు వేణు, లక్ష్మీపతి, సుధాకర్, శేషాద్రి, సుబ్రహ్మణ్యం, ఆనంద్ పాల్గొన్నారు.

జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో శివాజి జయంతి

ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో ఛత్రపతి శివాజి జయంతిని విశ్వవిద్యాలయంలోని శ్రీరమా రంజన్ ముఖర్జీ ఆడిటోరియంలో బుధవారం ఘనంగా నిర్వహిం చారు. మొట్ట మొదట ఛత్రపతి శివాజి చిత్రపటానికి పూలమాలలు వేసి, భక్తిశ్రద్ధలతో పూజించారు. శివాజి మహరాజు జీవనాన్ని సంస్కృత డాక్యుమెంటరీ ద్వారా అందరికీ ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశ్వ విద్యాలయం అయోధ్య మందిర నిర్మాణ ట్రస్ట్ కోశాధ్యక్షులు గోవిందదేవగిరి మహరాజ్ ఆన్‌లైనులో అనుగ్రహ భాషణం చేశారు. రాష్ట్ర నిర్మాణంలో ఛత్రపతి శివాజి మహరాజు ఔన్నత్యాన్ని వర్ణించారు. అందరూ దేశహితం కోసం బాధ్యతతో పని చేయాలని సూచించారు. అందరికీ ఆశీస్సులు అందించారు. సన్మాన అతిథి విశ్వవిద్యాలయం అకడమిక్ డీన్ ప్రొఫెసర్ రజనీకాంత శుక్లా మాట్లాడుతూ దేశనిర్మాణమే లక్ష్యంగా శివాజి మహరాజు తన జీవితాన్ని ధీరత్వానికి ప్రతీకగా నిలిచారని తెలిపారు. గౌరవ అతిథి డీన్ ఆఫ్ స్టూడెంట్స్ వెల్ఫేర్ ప్రొఫెసర్ దక్షిణామూర్తి శర్మ మాట్లాడూతూ శివాజి జీవితం ఆధునిక యువతకు మర్గదర్శనమని అందరూ ఆయన మార్గంలో ముందుకు నడవాలని సూచించారు. విశిష్ట అతిథి విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ కె వెంకట నారాయణరావు మాట్లాడుతూ ఛత్రపతి శివాజి మహరాజ్ వీరత్వానికి, ధీరత్వానికి, దేశభక్తికి ప్రతీక అని అందరూ ఆయన లక్షణాలను అలవరచుకుని దేశరక్షణకు, సమాజహితం కోసం పని చేయా లని వర్ణించారు. సభాధ్యక్షులు అద్వైత వేదాంత విభాగ వరిష్టా చార్యులు ప్రొఫెసర్ కె గణపతి భట్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలను విశ్వవిద్యాలయంలో నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో దేశభక్తి పెరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ శివాజి జీవనాన్ని మార్గదర్శకంగా తీసుకుని ధైర్యంగా, గర్వంగా దేశాభివృద్ధికి, సమాజ పురోగతికి పని చేయాలని సూచించారు. విద్యార్థులు వివిధ పోటీలలో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సంయోజకులు అద్వైతవేదాంత విభాగం అధ్యాపకులు డాక్టరు మనోజ్ శిండే, డాంక్టరు శివరామ దాయగుడే, విభిన్న విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు టిడిపి విస్తృత సమావేశం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :

టిడిపి విస్తృత స్థాయి సమావేశం గురువారం ఉదయం 10 గంటలకు పున్నమి సర్కిల్ ఎదురుగా కార్తీక్ ఫంక్షన్ హాలులో నిర్వహిస్తామని పుత్తూరు పట్టణ టిడిపి అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్ ఎన్ ధనపాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా, నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్. హాజరు అవుతారని పేర్కొన్నారు. పుత్తూరు పట్టణ టిడిపి కుటుంబ సభ్యులు, వార్డు కమిటీలు, పట్టణ కమిటీ, నియోజకవర్గ, పార్లమెంట్, రాష్ట్ర కమిటీల సభ్యులు హాజరు కావాలని సూచించారు.

టిడిపి పాలనలోనే బీసీలకు గుర్తింపు

వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దేవాళ్ల మురళి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:

మాజీ రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ ఛైర్మన్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి దేవళ్ళ మురళి శ్రీశైలంలో ఇటీవల జరిగిన వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నిక మొదటిసారిగా చిత్తూరు జిల్లా కేంద్రానికి విచ్చేసిన సందర్భంగా బుధవారం బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో సంఘం అధ్యక్షుడు రవిరాజు, దక్షిణాది రాష్ట్రాల బిసి సంక్షేమ సంఘం ఇంచార్జ్ పి.షణ్ముగం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మురళి మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో రాష్ట్రంలోని వడ్డెర జాతి ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నుకున్నదని, వడ్డెర జాతి కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రవిరాజు, హరి, కుసుమ, రుద్రయ్య, గురప్ప, చిరంజీవి, సివి.ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి

ప్రజాశక్తి- పలమనేరు :

పలమనేరు రూరల్ మండలంలోని కల్లాడం, కొలమాసనపల్లి రైతు సేవా కేంద్రంలో జరిగిన రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య కేటాయింపు నమోదు కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు నాగపద్మిని, మండల వ్యవసాయాధికారి సంధ్యతో కలసి సందర్శించారు. ఆమె మాట్లాడుతూ రైతులకు భవిష్యత్తులో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలంటే ప్రతి రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరిగా కలిగి ఉండాలని అన్నారు. ఈ విశిష్ట గుర్తింపు కార్డు పొందిన రైతులకు ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, పంట భీమా, పంటరుణాల పై వడ్డీ రాయితీ పెట్టుబడి సాయం, వ్యవసాయ యంత్ర పరికరాలు, అందుతాయని తెలిపారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు

ప్రజాశక్తి- శాంతిపురం: స్థానిక ఎంపిడీవో కార్యాలయంలో ఎంపిడివో, మండల ప్రత్యేక అధికారి డీఈఈ పిఆర్.గురవారెడ్డి పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ సహాయకులతో బుధవారం తాగునీరు, శానిటేషన్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపిడివో మాట్లాడుతూ మండలంలో 124 పంపులు పనిచేస్తున్నాయని, ఏవైనా మరమ్మతులకు గురైతే వెంటనే రిపేరు చేసి వినియోగంలోకి తెచ్చేలా సామాగ్రి అందుబాటులో ఉన్నాయని, ప్రతి రోజు బోరు మెకానిక్ అన్ని గ్రామాలలో అవసరమైన చోట రిపేర్లు చేపడుతున్నారని తెలిపారు. గత వారంలో మండలంలో 9 గ్రామాలలో తాగునీరు పథకానికి సంబంధించిన రిపేర్లు చేయడం జరిగిందని, మండలంలో ఏదైనా పంచాయతీలో తాగు నీటి బోర్లు రిపేరు అయితే 24 గంటల్లో రిపేరు చేసి తాగునీటి సరఫరాకు అంతరాయం కలగకుండా చూస్తామని అన్నారు. ఇప్పటివరకు ఎక్కడా తాగునీటి సమస్య లేనందున ట్యాంకరు ద్వారా తాగునీటి సరఫరా చేయలేదని, తాగు నీటి బోర్లు చుట్టూ శుభ్రంగా ఉంచాలని ప్రజలందరూ కూడా దీనికి సహకరించి పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచటానికి సహకరించాలని కోరారు. గ్రామాలలో తాగునీటి సమస్య, పారిశుద్ధ్య నిర్వహణలో లోపాలు ఉంటే 94910 71394 నెంబరుకు ఫోన్ చేసి తనకు తెలియజేయాలని ప్రజలను కోరారు.